

ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్‌కు దరఖాస్తుల స్వీకరణ



శ్రీకాకుళం : ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ డ్రైవింగ్ శిక్షణ పొందడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ నెల మూడో వారంలో ప్రారంభమయ్యే 21వ బ్యాచ్‌లో 16 మందికి మాత్రమే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9441161051, 9390886033 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అన్నదాత సుఖీభవ ఎందరికో?

- సాయం అందజేతకు ప్రభుత్వం కసరత్తు
- కమిషనరేట్ నుంచి జిల్లాలకు జాబితాలు
- క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది
- ఈనెల 20వ తేదీ లోపు పూర్తికి ఆదేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు అందిస్తామంటూ టిడిపి కూటమి ఎన్నికల ముందు హామీనిచ్చింది. 2024 ఖరీఫ్ నుంచే తమకు పెట్టుబడి సాయం అందుతుందని రైతులు భావించినా, ప్రభుత్వం నిరాశనే మిగిల్చింది. దీంతో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పిఎం కిసాన్ యోజన పథకం ద్వారా అందిస్తున్న సాయంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అన్నదాత సుఖీభవ కింద సాయాన్ని ఖరీఫ్ ప్రారంభానికి ముందే అందిస్తామని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం పలు మార్గదర్శకాలను వెలువరించింది. అందుకనుగుణంగా అధికారులు కసరత్తు మొదలుపెట్టారు.

టిడిపి కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన 'అన్నదాత సుఖీభవ' అమలుకు సర్కారు సిద్ధమవుతోంది. అర్హులైన రైతులకు ఏడాదికి సాగు ఖర్చుల కోసం రూ.20 వేలు ఆర్థికసాయం అందించనుంది. ఈ సాయాన్ని ప్రధానమంత్రి కిసాన్ యోజన మాదిరిగానే మూడు విడతలుగా ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. పిఎం కిసాన్ యోజన ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.రెండు వేలు చొప్పున మూడు విడతలుగా ఏడాదికి రూ.ఆరు వేలు సాయం అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.ఆరు వేలకు మరో రూ.14 వేలు కలిపి రూ.20 వేలు మొత్తాన్ని ఇవ్వనున్నట్లు ప్రభుత్వం చెప్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అందించే సాయాన్నీ మూడు విడతలుగానే అందించనుంది.

అన్నదాతకు సుఖీభవ కింద అందించనున్న సాయానికి సంబంధించి ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన వెబ్‌ల్యాండ్ డేటాను విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌తో పాటు మండల వ్యవసాయశాఖ అధికారుల లాగిన్‌లకు పంపారు. వెబ్‌ల్యాండ్‌లో సర్వే నంబర్లు, రైతు పేరు, విస్తీర్ణం కచ్చితంగా ఉన్నదీ, లేనిదీ రైతు సేవా కేంద్రాల్లో పరిశీలించి ఎఒ లాగిన్‌కు పంపుతారు. ఆ తర్వాత జిల్లా వ్యవసాయశాఖ అధికారికి పంపుతారు. వెబ్‌ల్యాండ్‌లో ఏమైనా తప్పులుంటే సరి చేస్తారు. లేకుంటే తహశీల్దార్ల దృష్టికి తీసుకువెళ్లి సరిచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. క్షేత్రస్థాయి పరిశీలనలో అనర్హులను గుర్తించి జాబితా నుంచి తొలగిస్తారు. మృతులు, ఉద్యోగులు ప్రభుత్వ ఫించన్ పొందేవారు, ఆదాయపు పన్ను చెల్లించే వారి వివరాలన్నీ వెబ్‌ల్యాండ్‌కు అనుసంధానం చేసి తొలగించాలని వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లావ్యాప్తంగా ఉన్న 658 రైతు సేవా కేంద్రాల్లో ప్రస్తుతం ఈ ప్రక్రియ కొనసాగుతోంది. డేటా పరిశీలన పూర్తయిన తర్వాత ఈనెల 20వ తేదీ లోపు వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించింది.

సాయం వారికేనా?

జిల్లాలో ఇప్పటివరకు పిఎం కిసాన్ యోజన కింద సాయం పొందుతున్న వారికే అన్నదాత సుఖీభవ పథకం వర్తింప చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లాలో ప్రస్తుతం పిఎం కిసాన్ లబ్ధిదారులుగా ఉన్న 2.33 లక్షల మందికే సాయం అందనుంది. మృతులు, ప్రభుత్వం చేపడుతున్న ఇతర వడపోతల ద్వారా ఈ సంఖ్య మరింత తగ్గనుంది.

జాబితాల పరిశీలన చేపడుతున్నాం

రైతుల భూములకు సంబంధించి వెబ్‌ల్యాండ్ డేటాను పంపారు. దాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో అగ్రికల్చర్ అసిస్టెంట్స్ మండల వ్యవసాయశాఖ అధికారులు వీటిని పరిశీలిస్తున్నారు. డేటా సరైందా, కాదా పరిశీలించి అర్హులా? అనర్హులా? అనేది నిర్ణయిస్తారు. డేటా పరిశీలన పూర్తయిన తర్వాత జాబితాను ప్రభుత్వానికి తిరిగి పంపుతాం.

- త్రినాథస్వామి, వ్యవసాయశాఖ జెడి

ఆర్‌టిజిఎస్‌లో మరోసారి వడపోత

జిల్లాస్థాయిలో పరిశీలన పూర్తయిన తర్వాత వెబ్‌ల్యాండ్ వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తారు. అక్కడ నుంచి ఆర్‌టిజిఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్)కు పంపుతారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆధార్ అనుసంధానంగా ఉన్న అనర్హులను గుర్తించి తుది జాబితాను మళ్లీ రైతు సేవా కేంద్రాలకు పంపుతారు. అందులోని లబ్ధిదారులందరితో తప్పనిసరిగా ఇకెవైసి చేయిస్తారు. ఆ ప్రక్రియలో అప్పటికీ ఎవరైనా అనర్హులు నమోదై ఉంటే గుర్తిస్తారు.

విద్యుత్ భారాలు వద్దు

- యాక్సిస్, సెకీ ఒప్పందాలను రద్దు చేయాలి
- స్మార్ట్‌మీటర్లను నిలిపివేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు
- విద్యుత్‌శాఖ కార్యాలయాల వద్ద సిపిఎం నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం, టెక్కలి రూరల్, కొత్తూరు, రణస్థలం

ప్రజలపై విద్యుత్ భారాలను మోపొద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి అన్నారు. యాక్సిస్, సెకీ ఒప్పందాలను, స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్, సర్‌ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన శ్రీకాకుళం నగరం, టెక్కలి, కొత్తూరు, రణస్థలంలో విద్యుత్‌శాఖ కార్యాలయాల వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం నగరంలోని ఇపిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి వారు మాట్లాడారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోము సరికదా తగ్గిస్తామని ప్రజలను నమ్మబలికారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల కాలంలో రూ.15.485 కోట్లు విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారాన్ని మోపి ప్రజలను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం మోపి, యాక్సిస్ కంపెనీకి కట్టబెట్టడానికి టిడిపి కూటమి ప్రభుత్వం చేయించిన ఈ ఒప్పందం అనుమతించరానిదన్నారు. గతంలో అదానీ సంస్థతో సెకీ ద్వారా సోలార్ విద్యుత్ యూనిట్ రూ.2.49 ఒప్పందం చేసుకోగా, అది అధిక రేటు అని తెలుగుదేశం విమర్శించిన విషయాన్ని గుర్తుచేశారు. నేడు దానికంటే రూ.2.10 అధికంగా చేసే ఒప్పందాలు చేసుకోవడం గర్హనీయన్నారు. సోలార్ ప్యానెల్స్, ఇతర ఉత్పాదకాల ఖర్చు భవిష్యత్‌లో ఇంకా తగ్గే వీలున్నందున విద్యుత్ రేట్లు ఇంకా తగ్గుతాయని తెలిపారు. ఆ ప్రయోజనం కూడా వినియోగదారులకు దక్కకుండా రూ.4.60కు పాతికేళ్లకు యాక్సిస్‌తో ఒప్పందం చేసుకోవడం దారుణమన్నారు. అన్నివిధాలా నష్టదాయకమైన ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు, విద్యుత్ వినియోగదార్లు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్, సర్‌ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజల మద్దతుతో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.అమ్మన్నాయుడు, పలు సంఘాల నాయకులు ఎం.ఆదినారాయణమూర్తి, కొత్తకోట అప్పారావు, అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, ఎన్.వి.రమణ, ఆర్.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో జెడ్‌పి రోడ్డు సిపిఎం నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్య, వెంకటరావు, ప్రసాద్, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో విద్యుత్‌శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాదరావు, నాయకులు నిమ్మక అప్పన్న, పి.కృష్ణ, రమేష్.తదితరులు పాల్గొన్నారు.

రణస్థలంలోని రావాడ రోడ్డులో నిర్వహించిన నిరసనలో సిపిఎం నాయకులు సిహెచ్.అమ్మన్నాయుడు, వెలమల.రమణ, డి.మహాలక్ష్మి నాయుడు, ఎం.నర్సింహులు, ఎస్.పాపారావు, కె.రామప్పడు, తదితరులు పాల్గొన్నారు.



రణస్థలంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు



టెక్కలిలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఒకటో బెటాలియన్ కమాండెంట్‌గా పద్మనాభరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో కొత్తగా ఏర్పాటైన ఎపిఎస్‌పి ఒకటో బెటాలియన్ కమాండెంట్‌గా పద్మనాభరాజు నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ జిల్లాలో కమాండెంట్‌గా నియమించారు. ఎచ్చెర్లలోని బెటాలియన్ హెడ్ క్వార్టర్స్‌లో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రక్షణ వ్యవస్థలో శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తులు, తీవ్రవాద నిర్మూలన, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు సివిల్ పోలీసులకు సహాయకారిగా ఉండేందుకు ఎపిఎస్‌పి బెటాలియన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బెటాలియన్ నిర్మాణం, నిర్వహణ కార్యకలాపాల గురించి సిబ్బందితో చర్చించారు. ఆయనకు అడిషనల్ కమాండెంట్ పి.సత్తిబాబు, అసిస్టెంట్ కమాండెంట్స్ నాగేశ్వర రెడ్డి, నాగ శ్రీను, నగేష్‌బాబు, గోపాలకృష్ణ, ఎఒ తిలక్, ఆర్ఐ శ్రీధర్ స్వాగతం పలికారు.


ఇచ్ఛాపురం చేరుకున్న మస్కట్ బాధితులు

స్వస్థలాలకు మస్కట్ బాధితులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉపాధి కోసం మస్కట్ వెళ్లి అక్కడ కంపెనీ ప్రతినిధుల చేతిలో మోసపోయి తీవ్ర ఇబ్బందులు పడిన తొమ్మిది మంది జిల్లావాసులు ఎట్టకేలకు శుక్రవారం స్వస్థలమైన ఇచ్ఛాపురం చేరుకున్నారు. నెలల తరబడి తీవ్ర ఇబ్బందులు పడిన వారికి ఆహారంతో పాటు తిరిగి స్వస్థలాలకు చేరుకునేందుకు అవసరమైన ఏర్పాట్లను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తన సొంత ఖర్చుతో చేశారు. మస్కట్‌లో ఉన్న బాధితులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడి మనోధైర్యాన్ని కల్పించి అండగా నిలిచారని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విదేశాంగ శాఖ, మస్కట్‌లోని భారత దౌత్య కార్యాలయంతో పాటు టిడిపి ఎన్ఆర్ఐ విభాగంతో సమన్వయం చేసి, కార్మికులకు వసతి, ఆహారం అందించారని వివరించారు. ముంబై విమానాశ్రయ అధికారులతో సమన్వయం చేసుకుని, ముంబై నుంచి శ్రీకాకుళం వరకు ప్రయాణ ఖర్చులు స్వయంగా భరించి స్వస్థలాలకు చేర్పించారని బాధితులు తెలిపారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి 'ఉషు' పోటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జిల్లా ఉషు అసోసియేషన్ ఆధ్వర్యాన 11వ సబ్ జూనియర్, 10వ జూనియర్, 9వ సీనియర్ ఉషు జిల్లాస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.జోగినాయుడు అధ్యక్షతన నిర్వహించిన సభలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి కె.శ్రీధర్ మాట్లాడుతూ విద్యారంగంలో క్రీడలకు మూడు శాతం కోటా ఉంటుందని తెలిపారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి మాట్లాడుతూ ఉషు క్రీడలో జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన వారు ఉన్నారని చెప్పారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు కర్నూలులో నిర్వహించే రాష్ట్రస్థాయి ఉషు పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉషు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పొగిరి కృష్ణంనాయుడు, రెడ్డి శివకుమార్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో బంగారు పతకాలు సాధించిన వారు రాష్ట్రస్థాయిలో పాల్గొనడానికి అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, రెడ్డి సాయి కుమార్, స్టార్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు గేదెల లక్ష్మి, సీనియర్ క్రీడాకారులు మురళి, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాల రవాణాపై పటిష్ట నిఘా

ప్రజాశక్తి - శ్రీకాకుళం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి మహేశ్వర రెడ్డి తదితరులు

మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలపై పటిష్టమైన చర్యలు అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా యాక్షన్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, వర్కర్లు, ఆటో డ్రైవర్లను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల రవాణా, విక్రయాలు సాగుతున్నాయన్నారు. డ్రగ్స్ విక్రయాలు జరిగే ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు.

బాధితులకు కౌన్సెలింగ్, పునరావాసం కల్పించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు మందుల దుకాణాల్లో సిసి కెమెరాలు అమర్చాలన్నారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా 18 ఏళ్ల లోపు వారికి మందులు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాలను అరికట్టే సమాచారంతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఈగల్ బృందాలు మాదకద్రవ్యాల నిరోధంపై ప్రత్యేక నిఘా ఉంచాయన్నారు. డ్రగ్స్ సమాచారం కోసం 112, 1972 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. రిమ్స్‌లోని డి-అడిక్షన్ సెంటర్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. హాస్టళ్లు, పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్ వాడకంపై పర్యవేక్షణ ఉందన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి

జిల్లాలో రోడ్డు భద్రతా చర్యలను మరింత కఠినతరం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రహదారులపై ప్రమాదాలకు అవకాశాలున్న చోట్ల ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను బలోపేతం చేయాలన్నారు. డివైడర్లను తొలగిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బ్లాక్ స్పాట్స్ గుర్తించి డ్రైవర్ల కోసం రెస్ట్ ఏరియాలు ఏర్పాటు చేయాలన్నారు. అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. సమావేశంలో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ విజయసారథి, ఎన్‌హెచ్ ప్రాంతీయ ప్రాజెక్టు డైరెక్టర్ తివారీ, ఎంవిఐ గంగాధర్, డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, డిఎంహెచ్ఒ అనిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాతో ఉపాధి కల్పన

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ప్రజాశక్తి - నరసన్నపేట

జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహిస్తున్న జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు 12 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 327 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా అందులో 112 మంది పలు కంపెనీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అభ్యర్థులు కంపెనీల చుట్టూ తిరుగుతూ ఉదోగాల కోసం నిరీక్షించాల్సి వచ్చేదని, ఇప్పుడు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన కంపెనీలే మన వద్దకు వచ్చి వారికి కావాల్సిన అభ్యర్థులను ఎంపిక చేసుకునే విధంగా పరిస్థితులు మెరుగుపడ్డాయని వివరించారు.

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయి కుమార్ మాట్లాడుతూ ఏ రంగంలో ఉద్యోగ అవకాశం వచ్చినా సరే దూరంతో సంబంధం లేకుండా అభ్యర్థులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందు ఉద్యోగంలో చేరి తర్వాత ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి సుధ, సెట్ శ్రీ సిఇఒ ప్రసాదరావు, కళాశాల ప్రిన్సిపాల్ పి.లత, ఇతర ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మిషన్ వాత్సల్య పథకం అమలుపై బాలల సంక్షేమ, రక్షణ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలు, డ్రాపౌట్ బాలలు, కార్మికులుగా పనిచేస్తున్న చిన్నారులను గుర్తించి తక్షణమే వారికి పునరావాసం కల్పించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో బాల్య వివాహాల సమాచారం తెలిసిన వెంటనే అక్కడికి చేరుకుని వివాహాలను నిలిపివేసి, సంబంధితులపై కేసులు పెట్టాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి శాఖ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. టీనేజీ ప్రెగ్నెన్సీ, ట్రాఫికింగ్, డ్రగ్స్, దోపిడీ వంటి అంశాలపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాధిత బాలికలకు వన్ స్టాప్ సెంటర్ల ద్వారా తక్షణ ఆశ్రయం, చికిత్స, న్యాయ సహాయం కల్పించాలని, కేసులపై మహిళా పోలీసులు నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. డ్రాపౌట్ బాలికల సమస్యలపై డిఇఒ, కర్మాగారాల్లో పనిచేస్తున్న బాలికల విషయమై లేబర్ కమిషనర్ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆరు నెలలకు జిల్లాస్థాయిలో కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, డిఎంహెచ్ఒ కె.అనిత, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, చైల్డ్‌లైన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం


వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

వేసవి సెలవుల్లో ఉపాధ్యాయ, ఉద్యోగుల బదిలీలు, ఉద్యోగోన్నతులు కల్పించేందుకు తక్షణమే ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారిని శుక్రవారం కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియతో పాటు స్పష్టమైన జిఒలు లేకుండా సర్దుబాటు ప్రక్రియ చేపట్టడం ఉపాధ్యాయులకు ఆందోళనకు గురిచేస్తోందన్నారు. సమస్యలను గుర్తింపు సంఘాల సమావేశాల్లో ఉన్నతస్థాయి అధికారులకు వివరించినా పరిష్కారం చూపడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. జిఒ 117 రద్దు చేసి కొత్త జిఒ ఆధారంగా ప్రాథమిక పాఠశాలలో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలన్నారు. మోడల్ స్కూల్‌లో ఐదు తరగతులు బోధించడానికి వీలుగా ఐదుగురు ఉపాధ్యాయులను తప్పక నియమించాలన్నారు. ఉర్దూ, ఒరియా మైనర్ మీడియం బోధించే ఉపాధ్యాయులను తెలుగు మీడియం కలిపి లెక్కించి పోస్టులు కేటాయించడం సరికాదని ఆ పోస్టులు అదనంగా ఇవ్వాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించడంతో పాటు ఉన్నత పాఠశాలలో సమాంతర మీడియాన్ని కొనసాగించాలన్నారు. వీటితో పాటు గందరగోళానికి దారితీస్తున్న పలు అంశాలపై అధికారులు, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా కార్యదర్శి జి.సురేష్, అన్నాజీ, స్వర్ణకుమారి, జి.శ్రీరామచంద్రమూర్తి, ఎల్.కోదండరామయ్య, టి.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

11న లేబర్ కోడ్‌లపై సదస్సు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న అఖిల భారత సమ్మెకు మద్దతుగా ఈనెల 11న 'కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ కార్మికులకు వరమా-శాపమా' అనే అంశంపై శ్రీకాకుళం నగరంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు తెలిపారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో అఖిల భారత సమ్మె సన్నాహక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని విమర్శించారు. కార్మిక సంఘాలను బలహీనపరచి యాజమాన్యాల శ్రమ దోపిడీని మరింత పెంచుకునేందుకు, అక్రమ తొలగింపులు, పనిభారం, పని గంటలు పెంచడానికి తీసుకొచ్చిందని వివరించారు. పెట్టుబడిదారులకు ఉద్యోగులు, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. అఖిల భారత సమ్మె సన్నాహకంలో భాగంగా సదస్సుతో పాటు ఈనెల 16నుంచి 18వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ, ఎ.సత్యనారాయణ, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండరాదు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి

ప్రజాశక్తి- పలాస

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటి కప్పుడు వారి సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అధికారులు సూచించారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్‌పి ప్రజలు వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖా ముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని, ఆయా ఫిర్యాదులు పెండింగ్ లేకుండా చూడాలని ఎస్‌పి పోలీసు అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే తెలియజేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చే ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఎప్పటి కప్పుడు జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక ద్వారా పంపించాలన్నారు.



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మరమ్మతులు చేశారు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

కవిటి: తాగునీరు వృథా అంటూ శుక్రవారం ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. శుక్రవారం ఉదయం ఇద్దివానిపాలెం వంతెన వద్దకు చేరుకున్న ఉద్దానం ప్రాజెక్ట్ సిబ్బంది పైపు లీకు వద్ద మరమ్మతులు చేసి నీటివృథా అరికట్టారు. అదే సమయంలో బాలాజీపుట్టుగ వద్ద లీకవుతున్న ఎయిర్‌వాల్ సరిచేశారు. దీనిపై స్థానికులు స్పందిస్తూ చెరువును తలపించేలా తయారైన వంతెనకు 'ప్రజాశక్తి' వార్తతో మోక్షం లభించిందని కొనియాడారు. ఈ మరమతుల్లో ఉద్దానం సిబ్బంది పి. జోగారావు, జె.శ్రీను, పి.ధనుంజయ, జి.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



విప్‌కు వినతిపత్రం అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో ఉన్న శ్మశానవాటిక అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ రోటరీ క్లబ్ ప్రతినిధులు శుక్రవారం ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాలం అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఇచ్ఛాపురం గ్యాస్ ఏజెన్సీ వద్ద ఉన్న శ్మశానవాటిక అభివృద్ధికి అవసరమైన చర్యలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు రోటరీక్లబ్ ప్రతినిధులు తెలిపారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు అందించిన వినతిపత్రంపై సానుకూలంగా స్పందించారని రోటరీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు రాజ్ కుమార్, దినేష్, కె.రామారావు, నవీన్ చౌదరి, పాక దాసు, టిడిపి నాయకులు కాళ్ల జయదేవ్, లీలారాణి, నంధిక జాని పాల్గొన్నారు.

ఐతమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్



ఉదయశ్రీ

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిఎస్అండ్‌హెచ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న అల్లు ఉదయశ్రీకు వీర్ సురేంద్ర సాయి యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ, బుర్లా, ఒడిస్సా కెమిస్ట్రీ విభాగంలో పిహెచ్‌డి పట్టాను మంజూరు చేసిందని ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే యూనివర్శిటీ కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రామకృష్ణ డి.ఎస్ మార్గదర్శకత్వంలో 'నోవెల్ ఫిరిమిడైన్ స్కాఫోల్డ్స్ బేస్డ్ గ్రీనర్ సింతసిస్ ఆఫ్ రిబో సైక్లిక్ వయా నైట్రోజన్ కంటైనింగ్ హెటరో న్యూక్లియర్ మొలెస్' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ పిహెచ్‌డి డిగ్రీ జారీ అయిందన్నారు.ఉదయశ్రీని ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాసరావు, డీన్ ఆరెన్డీ డాక్టర్ డి. శ్రీరాములు, హెచ్ఒడిలు డాక్టర్ ఎం.వి.రత్నమణి, డాక్టర్ ఎం.రమణయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

'పోక్సో'పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి జోత్స్న

పొందూరు: పోక్సో చట్టంపై ప్రతిఒక్కరూ తప్పని సరిగా అవగాహన పెంపొందించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి బి.జోత్స్న అన్నారు. మండలం కింతలిలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చెక్‌బౌన్స్, ప్రాంసరీ నోట్లుకు సంబంధించిన న్యాయపరమైన అంశాలను వివరించారు. అనంతరం పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పుల హనుమంతరావు, న్యాయవాదులు బి.మంజుల, బ్రహ్మాజీ రాము, కృష్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జవాను మృతిపై అచ్చెన్న దిగ్భ్రాంతి

శ్రీకాకుళం: జమ్మూ కాశ్మీర్‌లో పాకిస్తాన్ సైనికులు జరిపిన కాల్పుల్లో రాష్ట్రంలోని సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కుప్పితండా గ్రామానికి చెందిన మురళి నాయక్ మృతిపై వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ మురళీ నాయక్ అని కొనియాడారు. ఆయన కాల్పుల్లో మృతి చెందాడని తెలిసి తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్తతల నడుమ దేశ సైనికులు ఎదిరించి పోరాడుతున్నారని, అందులో ధైర్య సాహసాలతో రాష్ట్రానికి చెందిన జవాన్ మృతి చెందడం ఆ కుటుంబానికి తీరని లోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇసుక ర్యాంపు పరిశీలన



ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న తహశీల్దార్ బాలకృష్ణ

కొత్తూరు: మండలంలోని అధికారి కంగా నిర్వహిస్తున్న ఆకుల తంపర ఇసుక ర్యాంపును శుక్రవారం తహశీల్దార్ కె.బాలకృష్ణ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ నిబంధన ప్రకారమే ఇసుక ర్యాంపును నడిపించు కోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్ప వని హెచ్చరించారు. ఈయనతో సిబ్బంది ఉన్నారు.

ప్రాణాలు పోతున్నా నిర్లక్ష్యమా..?

- ఇసుక ర్యాంపులకు రహదారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



లక్కుపురం గ్రామ సమీపంలో ప్రమాదకరంగా మారిన ప్రధాన రహదారి

ప్రజాశక్తి- బూర్జ

ఆర్అండ్‌బి శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై మండల ప్రజలు మండి పడు తున్నారు. ఒకవైపు ప్రయాణం చేస్తున్న వ్యక్తుల ప్రాణాలు పోతున్నా ఆర్అండ్‌బి శాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరిని అవలంబి స్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. పాలకొండ - శ్రీకాకుళం ప్రధాన రహదారి పూర్తిగా అధ్వానంగా మారడంతో ప్రయా ణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మండలంలోని తుడ్డలి, లక్కుపురం, రామన్నపేట, కొండపేట, అప్పలపేట, ఉప్పినివలస, కొల్లివలస తదితర గ్రామాల సమీపంలో రహదారి పూర్తిగా గోతులమయంగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి ఈ రహదారిపై ప్రయాణం చేస్తున్న వాహనదారులు గోతులను గమనించక బోల్తాపడడమే కాకుండా పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి.

ఇంత జరుగుతున్నా ఆర్అండ్‌బి శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఇసుక ర్యాంపులకు రహదారులను ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మాణం చేపడుతున్న ఎమ్మెల్యే ప్రజల ప్రాణాలు బలిగొంటున్న ఈ రహదారిని బాగు చేసేందుకు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని బహిరంగంగానే ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల కురిసిన వర్షాలకు లక్కుపురం గ్రామం వద్ద పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో ఆ సమయంలో రాకపోకలు సాగించిన వాహనదారులు పలువురు బోల్తాపడి గాయాల పాలై ఆస్పత్రిలో చేరిన సంఘటనలు ఉన్నాయి. ఇది గమనించిన పాలకొండ భాష్యం స్కూల్ వారు ప్రస్తుతం ఈ గోతులు ప్రమాదకరంగా ఉన్నాయని హెచ్చరికగా ఎర్ర జెండాను పాతి ఉంచారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఆర్అండ్‌బి శాఖతో పాటు ఇతర ప్రభుత్వ అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన గోతులను పూడ్చి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలతో పాటు వాహనదారులు కోరుతున్నారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వం కొత్తగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరిందని తహశీల్దార్ ఎన్.వెంకటరావు తెలిపారు. కొత్త రేషన్‌కార్డు, కొత్తగా కార్డులో చేరేవారు, కార్డు నుంచి సభ్యుల తొలగింపు, ఒక రేషన్ కార్డు నుంచి మరో రేషన్ కార్డుకు మళ్లింపు, రైస్ కార్డు సరెండర్ చేయడం, అడ్రెస్ మార్పునకు, ఆధార్‌కార్డు నెంబర్ల మార్పు చేసుకునేందుకు సంబంధిత సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.



ఎంపిడిఒకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

ఎంపిడిఒ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- మందస

మందస ఎంపిడిఒగా వై.వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం మండల పరిషత్‌లో పరిపాలన అధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై రెగ్యులర్ ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా వ్యవహరించిన ఎన్.రమేష్ నాయుడు నుంచి ఈయన బాధ్యతలు స్వీకరించారు. ఈయనకు కార్యాలయ పరిపాలన అధికారి బి.రుషేశ్వరరావు, ఇఒపిఆర్‌డి జయప్రకాష్, టైపిస్ట్ ధనలక్ష్మి, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేకమైన ఆశలు ఎరవేసి ఉద్యోగుల, పెన్షనర్ల ఓట్లు గుంజుకుని ఇప్పుడు గాలికి వదిలేసిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నరసన్నపేట నియోజకవర్గం వైసిపి ఉద్యోగులు, పెన్షనర్లు సంఘం అధ్యక్షుడు యారబాటి వెంకట రమణ అన్నారు. శుక్రవారం వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సిపిఎస్ రద్దు, డిఎ బకాయిల చెల్లింపు త్రిశంకు స్వర్గంలో ఉన్నాయన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులను కుదించడం, వాలంటీర్ వ్యవస్థని కొనసాగించడమే కాకుండా వారికి రూ.10 వేలు వేతనం పెంచుతామని చెప్పిన ప్రభుత్వం హామీలు నెరవేర్చలేదన్నారు. అంగన్వాడీ, ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, గ్రామ, వార్డు ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ స్కేల్ ఇవ్వాలని, ఉద్యోగ విరమణ అనంతరం ఉండే అన్ని ప్రయోజనాలు ఇచ్చి తీరాలని, పిఆర్‌సి ప్రకటించి ఐఆర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ భవన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎన్.రామారావు సిబ్బందికి సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫార్మ్ కమిషనర్ నిర్వహించారు. శుక్రవారం తన కార్యాలయంలో అన్ని సచివాలయంల ప్లానింగ్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘంలో గల అక్రమ కట్టడాలను గుర్తించి వాటిపై స్థానిక కోర్టులో కేసులు నమోదు చేసి పురపాలక సంఘ ఆదాయాన్ని మెరుగు పర్చుకోవాలన్నారు. పురపాలక సంఘంలో ఇంటి నిర్మాణం చేస్తున్న గృహ యజమానులను గుర్తించి ప్రతి వారితో కూడా బిల్డింగ్ అప్లికేషన్లు పెట్టించి వారికి బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిని గుర్తించి తగు చర్యలు తీసుకొనుటకు ప్రతిఒక్క సచివాలయ సిబ్బంది సహకరించాలన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘం పరిధిలోని అన్ని సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్సిల్ సర్వీసులపై దృష్టి

ప్రజాశక్తి- టెక్కలి

ఎపియస్ ఆర్‌టిసిలో సరుకు రవాణా, కొరియర్ పార్సిల్ చార్జీలు తక్కువగా ఉండటంతో ఎక్కువమంది వినియోగదారులు ఆర్‌టిసి పార్సిల్ సర్వీస్ వైపు మొగ్గు చూపుతున్నారని ఆర్‌టిసి సహాయక (సరుకు రవాణా) మేనేజర్ డి.దివ్య అన్నారు. శుక్రవారం టెక్కలి బస్‌కాంప్లెక్స్‌లో ఉన్న ఆర్‌టిసి పార్సిల్ కార్యాలయం తనిఖీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో భద్రంగా ఆర్‌టిసి నిర్వహిస్తున్న సరుకు రవాణా సేవలను వినియోగదారులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. ప్రతి డిపోలో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పార్సిల్ కార్యాలయాలు తెరిచి ఉంటాయన్నారు. వినియోగదారుడు ఎక్కువ మొత్తంలో సరుకు రవాణా చేయాలనుకుంటే డిజిటిలను అద్దె ప్రాతిపదికన ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టెక్కలి, శ్రీకాకుళం డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ ఎస్.ఆర్ కుమార్, ఈజర్, ఎటిబి ఏజెంట్ కమలాకర్ పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి సంబరాలు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని బేసి రామచంద్రపురంలో ఈ నెల 4 నుంచి జరుగుతున్న బేసి పోలమ్మ అమ్మవారి సంబరాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యుత్ దీపాల అలంకరణలతో సందర్శకులను సంబరాలు ఆకర్షిస్తున్నాయి. శనివారం కోయిడాన్స్, ఆదివారం రాత్రి రోషన్ లాల్ బృందంచే ఆర్కెస్ట్రా, సోమవారం జబర్దస్త్ కార్యక్రమం, మంగళవారం ఒడిశా మహిళా కళాకారులచే గరిడి సినీ కోలాటం నిర్వహించ నున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామం వద్ద ఏర్పాటు చేసిన మినీ ఎగ్జిబిషన్ పిల్లలను విశేషంగా ఆకర్షిస్తుంది.

కొలువుదీరిన 'ఉషోదయ యువజన సంఘం'

ప్రజాశక్తి- కవిటి



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ఉషోదయ యువజన సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం బాధ్యతలు చేపట్టింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ సమక్షంలో ఉషోదయ యువజన సంఘం నూతన అధ్యక్షుడుగా ఆరింగి కృష్ణారావు ప్రమాణస్వీకారం చేశారు. కవిటిలోని ఉషోదయ యువజన సంఘం భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడిగా బెందాలం చక్రధర్, కార్యదర్శిగా పొల్లాయి మోరేసు రుద్రయ్య, సహ కార్యదర్శిగా పి.ఉమాపతి, కోశాధికారిగా మొగ్రి ఆదినారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బెందాలం అబ్బాయి, సాంస్కృతిక కార్యదర్శిగా మొగ్రి గోపీ, క్రీడా కార్యదర్శిగా అందవరపు నవీన్ కుమార్, మీడియా కన్వీనర్‌గా పిన్నింటి సుదర్శన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామారావు, ఎంపిపి కడియాల పద్మ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లు లోల్ల రాజేష్, బార్ల చినబాబు, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, బెందాలం చిట్టిబాబు, మాజీ జడ్‌పిటిసి పొందల కృష్ణారావు, బెందాలం రమేష్, బెందాలం కిషన్, పాండవ చంద్రశేఖర్, విశ్రాంత అధ్యాపకుడు ప్రగడ వెంకటరమణ, మణిచంద్ర ప్రకాష్, ఆరింగి మధు, పొల్లాయి లక్ష్మణమూర్తి, ఆరింగి త్రివిక్రమరావు, బెందాలం రంగారావు, తెప్పల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రవికుమార్‌కు వినతులు అందజేస్తున్న ప్రజలు

ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కూన రవికుమార్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన ప్రజలు పలు సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు అందించారు. కొంతమంది గ్రామ సచివాలయ ఉద్యోగులు, క్షేత్రస్థాయి ప్రభుత్వ ఉద్యోగులు సమస్యల పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన ఆయా శాఖల అధికారులు, గ్రామ సచివాలయ క్షేత్రస్థాయి ఉద్యోగులతో ఫోన్ ద్వారా మాట్లాడి విధి విధానాలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్న ఉద్యోగులపై చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా కొంతమంది గ్రామ సచివాలయ ఉద్యోగులు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తూ లంచాలకు అలవాటు పడినట్లు తన దృష్టికి వచ్చిందని అటువంటి వారిని విధుల నుంచి తొలగించడం లేదా వేరే ప్రాంతానికి బదిలీ చేయడం తప్పనిసరిగా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.వెంకటరావు, పలుశాఖల ఉద్యోగులు, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టిడిపి మండల అధ్యక్షుడు నూక రాజు, నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు బొడ్డేపల్లి గౌరీపతిరావు, టిడిపి నాయకులు సనపల అప్పల నాయుడు, కూన ఆంజనేయులు, అన్నెపు భాస్కరరావు, నాగళ్ల మురళీధర్ యాదవ్ పాల్గొన్నారు.

తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న మెరైన్ సిఐ రాము

నౌపడ: భారత్, పాకిస్తాన్ దేశాల ఉద్రిక్తతల మధ్య సముద్ర తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు నిరంతర అప్రమత్తంగా ఉండాలని బావనపాడు మెరైన్ సిఐ డి.రాము సూచించారు. సంతబొమ్మాళి మండలంలోని భావనపాడు సముద్ర తీరంలో శుక్రవారం స్థానిక మత్స్యకారులు, ప్రజలతో సమావేశమయ్యారు. యుద్ధ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తీర ప్రాంతం నుంచి చొరబాట్లు ఉండొచ్చన్న హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు పలు సూచనలు చేశారు. అపరిచిత వ్యక్తులను గుర్తిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యుద్ధ నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంతకు ముందు గురువారం రాత్రి పోలాకి మండలం రాజారాంపురంలో స్థానిక మత్స్యకారులతో కలిసి పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐలు వి.శ్రీనివాస్, మన్మధరావు, మెరైన్ పోలీస్ సిబ్బంది, మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్ గొరకల ఆదినారాయణ, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

సైన్యానికి మద్దతుగా సంఘీభావ ర్యాలీ



ఇచ్ఛాపురం : సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ రామారావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

భారత్, పాకిస్తాన్ యుద్ధవాతవరణ నేపథ్యంలో భారత్ సైనికులకు మద్దతుగా నిలుస్తూ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ఈ ర్యాలీ కొనసాగిస్తూ మెయిన్ రోడ్డు, దాసన్న పేట, మార్కెట్ రోడ్డుమీదగా బస్ స్టాండ్ జంక్షన్ వరకు కొనసాగింది. భారత్ సైనికులకు మద్దతు నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది. సింధూర విజయవంతం కావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ సంఘీభావ ర్యాలీలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, వైసిపి నాయకులు ప్రేమ్ కుమార్, సెల్లా దేవరాజు, ఆసీ కృష్ణారెడ్డి, పురుషోత్తమ రెడ్డి, సాలీనా గాంధీ, బచ్చు జగన్ పాల్గొన్నారు.

కవిటి: పాకిస్తాన్ ఎన్ని డ్రోన్లు ప్రయోగించినా భారత సైన్యం వాటిని తుక్కుతుక్కుచేస్తుందని కవిటి వాసులు అన్నారు. భారత సైన్యానికి మద్దతుగా కవిటిలో చింతామణి కాలనీ వాసులు, గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై, సలాం సైనికా అంటూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, పొల్లాయి ఉమామహేశ్వరరావు, బావన రవి తదితరులు పాల్గొన్నారు.

010 పద్దు కింద జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం



వినతిపత్రం అందజేస్తున్న మల్లేశ్వరరావు

రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు, పెన్షనర్లకు 010 పద్దు కింద జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని గ్రంథాలయ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.మల్లేశ్వరరావు కోరారు. శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను కేంద్ర గ్రంథాలయంలో కలిసి సమస్యల పరిష్కారాన్ని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గత 15 ఏళ్లుగా గ్రంథాలయ ఉద్యోగులకు, పెన్షనర్లకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ నుంచి జీతాలు, పెన్షన్లు చెల్లిస్తున్నారని, ఇటీవల ప్రభుత్వాలు గ్రంథాలయాలకు గ్రాంట్ తగ్గించడం వల్ల ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రతినెల జీతాలు, పెన్షన్లు సకాలంలో అందడం లేదని వివరించారు. 010 పద్దు కింద జీతాలు, పెన్షన్లు చెల్లిస్తే సకాలంలో జీతాలు పొందగలమని, తర్వాత గ్రంథాలయాల అభివృద్ధికి పూర్తి తోడ్పాటు అందించగలమన్నారు. ఆయనతో పాటు గోపాలరావు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఎంపిక



హేమలత

నరసన్నపేట: స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలకు చెందిన పంచిరెడ్డి హేమలత పుట్టపర్తిలో గల శ్రీ సత్యసాయి విశ్వ విద్యాలయంలో మేథ్స్ హానర్స్ డిగ్రీ కోర్సుకు ఎంపికైందని కళాశాల డైరక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. బోధన, వసతి, వైద్య సదు పాయాలు ఈ యూని వర్సిటీలో పూర్తిగా ఉచితంగా అందించి విద్యార్థుల్లో ఆధ్యాత్మికత పెరిగేలా చూస్తారన్నారు. రాత, మౌఖిక పరీక్షల ద్వారా ఎంపికైన వీరిని కళాశాల చైర్మన్ పల్లి సూరిబాబు, అధ్యాపకులు అభినందించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కోటబొమ్మాళి: పారా లీగల్ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వా నిస్తున్న మండల న్యాయ సేవాధికార సంఘం అధ్యక్షులు ఎం.రోషిని ఒక ప్రకటనలో తెలిపారు. పారా లీగల్ వాలంటీర్లుగా పని చేయాలను కున్న వారు పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, విద్యార్థులు, న్యాయ సంబంధిత విద్యార్థులు, మైత్రి సంఘ సభ్యులు తదితరులు అర్హులన్నారు. దరఖాస్తుదారులు పదో తరగతి అర్హత కలిగి ఉండాలని, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నౌపాడ, జలుమూరు రెవెన్యూ మండలాల పరిధిలో నివాసితులై ఉండాలన్నారు. ఆశక్తి గల అభ్యర్థులు రెండు ఫోటోలు, ఆధార్ కార్డు, విద్యా సంబంధిత పత్రాలతో జూనియర్ సివిల్ కోర్టులో గల మండల న్యాయసేవాధికార సంఘం సిబ్బందికి ఈనెల 12లోగా సంప్రదించాలన్నారు. వాలంటీర్లుగా నియమితులైన వారికి ఎటువంటి పారితోషకం, వేతనంగాని చెల్లించ బడదని అమె తెలిపారు.

సోంపేట: సోంపేట కోర్టుల సముదాయ పరిధిలో పారా లీగల్ వాలంటీర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, ఆరవ అదనపు జిల్లా జడ్జి కె.కిషోర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జిఆర్‌పి ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. కుద్దిరాం రైల్వేగేటు వద్ద జరిగిన ఈ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తికి సుమారు 47 ఏళ్ల వయసు ఉంటుందని తెలిపారు. మృతుడు ఒంటిపై బిస్కెట్ కలర్ చొక్కా, నలుపు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సర్వజన ఆస్పత్రికి తరలించడం జరిగిందని తెలిపారు. మృతుడు వివరాలు తెలిసిన వారు జిఆర్‌పి పోలీస్ స్టేషన్ శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ నందు సంప్రదించాలని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసరావు

హత్య కేసు నిందితుడు అరెస్టు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మెయిన్‌రోడ్డులోని వర్షిణి బ్యూటీ పార్లల్, లేడీస్ కార్నర్ నిర్వాహకులు నర్సిపురం లక్ష్మిని తన భర్త తిరుపతిరావు బుధవారం అతికిరాతకంగా పీకకోసి హత్యచేసిన సంఘటన విదితమే. శుక్రవారం నిందితుడు తిరుపతిరావు పోలీసులకు లొంగిపోగా విలేకర్ల సమక్షంలో నిందితుడును ప్రవేశపెట్టి సిఐ కె.శ్రీనివాసరావు మాట్లాడారు. హత్యచేసిన తిరుపతిరావు భార్య గత రెండున్నర ఏళ్లుగా వేరువేరుగా ఉంటున్నప్పటికీ తన భార్యకు అక్రమ సంబంధాలు ఉన్నట్లు పలుమార్లు అమె షాపు వద్దకు వస్తూ భార్య ఫోన్ ఇవ్వాలని అడుగుతూ ఇబ్బందులుకు గురిచేసేవాడని, తనకు దూరం పెట్టిందని కోపంతో గత కొన్ని రోజులుగా అనుమానం మరింత ఎక్కువ కావటంతో గత నెల14న భార్యపై దాడి చేసిన విషయమై తనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా ఉందన్నారు. అయితే 2006లో వీరిద్దరికి వివాహం కాగా సొంత గ్రామం సంతబొమ్మాళి మండలం బడేనర్సాపురం గ్రామంలో రెండేళ్లు కాపురం చేసిన తరువాత కోటబొమ్మాళిలో అద్దె ఇంట్లో నివాసముండేవారని, తిరుపతిరావు చెడు అలవాట్లు, మద్యంకు బానిస కావడంతో ఆదాయం లేక ఇల్లు నడుపుటకు కష్టం అయిన నేపథ్యంలో లక్ష్మి బ్యూటీపార్లర్ షాపు నిర్వహిస్తుందన్నారు. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారన్నారు. నిందితుడుకు కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ వి.సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండల పరిధిలో కొయ్యం పంచాయతీ కొయ్యావానిపేట చెందిన కొత్త రమణ (32) తన పొలంలో కొబ్బరి మొక్కలకు వినియోగించే పురుగులు మందు తాగి గురువారం సాయంత్రం ఆత్మహత్య పాల్పడ్డాడు. ఎస్ఐ వి.సందీప్ తెలిపిన వివరాల మేరకు రమణకు అదే గ్రామానికి చెందిన మీనాతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. కూలిపని చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈయనకు మద్యం సేవించే అలవాటు ఉండటంతో నిత్యం మద్యం సేవించి భార్యతో గొడవ పడేవాడు. తన ఇంటి వద్ద ఉన్న పేరంటాలకు సంబంధించి గుండం సంబరం గురువారం జరుగుతుండగా బంధువులు వచ్చి తిరిగి వెళ్లిపోయారు. అప్పటికే మద్యం సేవించి ఉన్న రమణ సాయంత్రం భార్యతో గొడవపడ్డాడు. దీంతో ఆమె భర్త మీద కోపంతో అదే గ్రామంలో ఉంటున్న తన కన్నవారి ఇంటికి వెళ్లిపోయింది. దీంతో మనస్థాపానికి గురైన రమణ చనిపోతానని కొంతమందికి ఫోన్‌చేసి చెప్పాడు. అనంతరం కొబ్బరితోటలో వినియోగించే పురుగుల మందు తాగాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సకోసం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడుకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. తండ్రి అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వివరాలను నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- కవిటి


మండలం శిలగాం రోడ్డు, శవసానపుట్టుగ గ్రామం దగ్గర శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో కవిటి మండలం తోటవీధి గ్రామానికి చెందిన పొడియా సీతారాంకి తీవ్రమైన గాయలవ్వగా ఆయనతో ఉన్న మరొక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. జాడుపూడి నుంచి తమ గ్రామానికి వీరిరువురు ద్విచక్రవాహనంపై శిలగాం రోడ్డులో వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డు అంచులకి ద్విచక్ర వాహనం జారిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈలోగా అటువైపుగా పెళ్లికి వెళు న్న శవసానపుట్టుగ యువకులు వీరిని గమనించి అంబులెన్స్‌కి సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను సోంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల: మండల పరిధి తోటపాలెం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఈశ్వరరావు అనే వ్యక్తి గాయాల పాలయ్యాడు. పోలీసుల వివరాల మేరకు ఈశ్వరరావు వ్యక్తి తన పనులు ముగించుకొని శ్రీకాకుళం వైపు నుంచి సైకిల్‌పై ఇంటికి వస్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో గాయాల పాలవ్వగా స్థానికులు గమనించి 108 ఫోన్ చేసి శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వివరాలను నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నౌపడలో స్వల్ప అగ్ని ప్రమాదం

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడ పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు పోలీస్ స్టేషన్‌కు పక్కనే ఉన్న సాల్ట్ డిపార్ట్మెంట్‌కి చెందిన స్థలంలో శుక్రవారం మధ్యాహ్నం దట్టమైన పొగలతో ఆ ప్రాంతమంతా మంటలు అలుము కున్నాయి. సమాచారం అందుకున్న టెక్కలి అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. పక్కనే సాల్టు డిపార్ట్మెంట్‌కి చెందిన భవనాలు, కుడి వైపున పోలీస్‌స్టేషన్ ఉన్నాయి. ఎటువంటి ఆస్తి నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంతో భూసారం


కోటబొమ్మాళి : ర్యాలీ చేస్తున్న వెలుగు అధికారులు

కోటబొమ్మాళి: రసాయన రహిత వ్యవసాయం చేస్తే ప్రకృతిని కాపాడడంతో పాటు భూసారాన్ని పెంచి భావితరాలకు విషరహిత ప్రకృతిని, పంటభూములను అందిద్దామని వెలుగు ఎపిఎం శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని దుప్పిలపాడులో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు కూన శ్రీనివాసరావు, గొల్లపల్లి సత్యవతిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది సింహాచలం, రమణ మూర్తి, నిర్మల, హేమలత తదితరులు పాల్గొన్నారు.

పలు పంటలతో నేలను కప్పి ఉంచాలి

ఆమదాలవలస: మండలంలోని చేపేనపేట ప్రకృతి వ్యవసాయ యూనిట్ పరిధిలో జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారాయణ ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులచే నవధాన్యాల విత్తనాలను వేయించారు. ఈ సందర్భంగా చేపేన సురేష్ (సి.డి.ఎఫ్) మాట్లాడుతూ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి ఆధ్వర్యంలో చేపేనపేట యూనిట్‌లో నిమ్మతొర్లవాడలో ఎనిమిది మంది రైతులతో పదకొండెకరాల విస్తీర్ణంలో నవధాన్యాల విత్తనాలను వేయించినట్లు తెలిపారు. యూనిట్ పరిధిలో ఉన్న గ్రామాల్లో ప్రతి రైతుతో ఈ నవధాన్య విత్తనాలను వేయించడం జరుగుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రస్తుతం ఈ నవధాన్యాలు సాగును చేయడానికి అవసరమైన కిట్లను సిద్ధం చేసుకుని రైతులతో నవధాన్య సాగును చేయించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పిఎస్ తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి, రైతు నక్క దేవదత్తు పాల్గొన్నారు.


ఆమదాలవలస : నవధాన్యాల విత్తనాలను సిద్ధం చేస్తున్న రైతులు


గ్రామసభలో మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు

కనిమెట్టలో రెవెన్యూ గ్రామసభ

ప్రజాశక్తి- పొందూరు

మండలం కనిమెట్ట గ్రామంలో తహశీల్దార్ టి.వెంకటేష్ రామానుజుల ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే సందర్భంగా గ్రామంలో సుమోటోగా 1198 మంది రైతులకు సంబంధించి మ్యుటేషన్లపై అభ్యంతరాలు చేపట్టడం జరిగిందన్నారు. రీసర్వేపై ఎటువంటి సందేహాలున్నా తీర్చడానికి రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. రైతులు భూములకు సంబంధించి సరైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు చేస్తున్నట్లయితే సమస్యను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమములో ఆర్ఐ శ్రీనివాసరావు, విఆర్‌ఒలు, రైతులు పాల్గొన్నారు.

రేషనలైజేషన్ టీచర్లకు అన్యాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తొలిసారిగా బదిలీల చట్టం ద్వారా చేపట్టనున్న టీచర్ల బదిలీల్లో రేషన్‌లైజేషన్ టీచర్లకు అన్యాయం జరుగుతుందని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వి రమణ మూర్తి, జి.రమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన పాఠశాల స్ట్రక్చర్‌లో మార్పులు కారణంగా తమ ప్రమేయం లేకుండానే ఉపాధ్యాయులు పెద్దఎత్తున రేషనలైజేషన్‌కు గురవుతున్నారని, వీరికి బదిలీల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే దూర ప్రాంతాలకు వెళ్లి పనిచేయాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న స్టేషన్ పాయింట్లతో పాటు పాత స్టేషన్ పాయింట్లు ఎనిమిదేళ్లకు మించకుండా ఇవ్వాలని కోరారు.


ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి కుటుంబాలు

టిడిపిలో పలువురు చేరిక

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని ఎనిమిదో వార్డులో వైసిపికి చెందిన పలు కుటుంబాలు ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టిడిపిలో చేరారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఎనిమిదవ వార్డు ఇన్‌ఛార్జి దవళ అప్పలనాయుడు ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే రవికుమార్ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై టిడిపిలో చేరినట్లు తెలిపారు.

ఈ వంతెన ప్రమాదకరం

ప్రజాశక్తి- నందిగాం

జాతీయ రహదారి నుంచి జద్యాడ వయా కొత్త అగ్రహారం మీదుగా రహదారిలో వంశధార ప్రధాన ఎడమ కాలువపై 1989లో నిర్మించిన వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. కనీసం వంతెనపై ఉన్న రక్షణ గోడ దెబ్బతినడంతో పాటు పిల్లర్స్ ఉన్నచోట పెచ్చులూడి ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. ఈ వంతెన ఎప్పుడు కూలుతుందోనన్న భయంతో వాహన చోదకులు అనునిత్యం ప్రయాణం సాగిస్తున్నారు. ఈ మార్గంలో మెళియాపుట్టి, పర్లాకిమిడి, గొప్పిలి తదితర గ్రామాలకు వెళ్లేందుకు దగ్గర రహదారిగా వినియోగిస్తుంటారు. అటువంటి రహదారిలో వంతెన ప్రమాదకరంగా ఉండడంతో వాహన చోదకులు భయంతో ప్రయాణం సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి నిర్మాణాన్ని చేపట్టాలని ఈ ప్రాంతీయలతో పాటు వాహన చోదకులు కోరుతున్నారు.


కూలేందుకు సిద్ధంగా ఉన్న వంతెన

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న భానుమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

విద్య, ఉపాధ్యాయ రంగాల సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని కోరుతూ శుక్రవారం ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన కలెక్టరేట్ సమీపాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగం తీవ్ర ఒడిదుడుకులకు గురవుతోందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాల వ్యవస్థకు తీవ్ర విఘాతం ఏర్పడుతుందన్నారు. ప్రస్తుత విద్యా విద్యానంలో తెలుగు మాద్యమంలో చదువుకునేందుకు వీలు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు 12వ పిఆర్‌సి అమల్లో భాగంగా కమిషన్ నియామకం, మధ్యంతర భృతి, డిఎల చెల్లింపులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యమం తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్మోహన్, రాష్ట్ర కార్యదర్శి డి.సరస్వతి, ప్రధాన కార్యదర్శి ఎస్.వి అనిల్ కుమార్, దాసరి రామ్మోహనరావు, వి.నవీన్ కుమార్, ఎస్.శంకర్రావు, పి.అప్పలనాయుడు, బి.ఢిల్లేశ్వరరావు, పి.తిరుమలరావు, చంద్రశేఖర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఘనంగా గోఖలే జయంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

స్వాతంత్ర్యమానికి స్ఫూర్తిగా నిలిచిన తొలితరం ఉద్యమనేత గోపాలకృష్ణ గోఖలే అని గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు సురంగి మోహనరావు, ఎం.ప్రసాదరావు, పందిరి అప్పారావు, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, కొంక్యాన వేణుగోపాల్, నిష్టల నరసింహమూర్తి అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, మహాత్మాగాంధీజీ గురువు గోపాలకృష్ణ గోఖలే 159వ జయంతి సందర్భంగా గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీరు మాట్లాడారు. గోపాలకష్ణ గోఖలే విగ్రహానికి మందిర కమిటీ ప్రతినిధులు పూలమాలలు వేశారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించడంతో పాటు మహాత్మాగాంధీ లాంటి ఎందరో వ్యక్తులను తయారు చేసిన ఘనత గోఖలేకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్-102 గవర్నర్ కొంక్యాన మురళీధర్, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పొన్నాడ రవి, సువ్వారి రాజారావు పాల్గొన్నారు.


నివాళ్లర్పిస్తున్న నిర్వాహకులు


తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న జర్నలిస్టులు

పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంట్లో సోదాలు పత్రికా స్వేచ్ఛను హరించడమేనని ప్రజా న్యాయవాది బొడ్డేపల్లి మోహనరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ రెడ్‌బుక్ తెరిచి పత్రికా ఎడిటర్లు, జర్నలిస్టులపై కక్షసాధింపు చేపట్టడం ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు పరిపాలించినప్పటికీ జర్నలిస్టుల జోలికి పోలేదని గుర్తు చేశారు. సెచ్ వారెంట్ నోటీసులు లేకుండా సాక్షి ఎడిటర్ ఇంట్లో పోలీసులు చొరబడడం తగదని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కడమేనన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన చర్యలపై యావత్తు ప్రజానీకం ఖండించాలన్నారు. అనంతరం తహశీల్దార్ ఎస్.రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఎలాపంతుల శ్రీనివాసరావు, తమ్మినేని వాసుదేవరావు, మొజ్జాడ అన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిందరవందరగా రికార్డులు

ప్రజాశక్తి - సీతంపేట

ఒక గదిలో మూలన పడి ఉన్న పాత పుస్తకాలు పనికిరాని చిత్త కాగితాల మాదిరిగా పడి ఉన్నాయి. ఇవి ఎందుకూ పనికిరావనుకుంటే పొరపాటు పడినట్లే. సీతంపేట ఐటిడిఏ ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో కోట్ల విలువచేసే ఎం.బుక్‌లు, వివిధ రికార్డులు చిదరవందరంగా మూలన పడేసి ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్యిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో ఐటిడిఎ పరిధిలో గల 20 మండలాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న రహదారులు, ప్రహరీగోడలు, భవనాలు తదితర అభివృద్ధి పనులకు సంబంధించిన కోట్లు విలువ చేసే ఈ రికార్డులు, ఎం-బుక్‌లు, ఎగ్జిక్యూటివ్ ఇంజి నీరింగ్ కార్యాలయానికి అనుబంధంగా డిస్ట్రిక్ట్ కంప్యూటర్ సెంటర్ కార్యాలయం ఉండేది. ప్రస్తుతం అక్కడ పనిచేసిన ఔట్సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడంతో పాటు డిసిసికి అదనపు భవనాల్లేకపోవడంతో కోట్ల విలువ చేసే రికార్డులు స్టాప్ రూమ్‌లో ఒక మూలన పడి ఉన్నాయి. అవసరమై నప్పుడు ఇంజినీరింగ్ అధికారులు ఏ ఎం.బుక్ అడుగుతారో తెలియదు. అప్పుడు చిందర వందరంగా పడి ఉన్న ఉన్న బుక్‌లను వెతుక్కొని తీసుకొని మళ్లీ అక్కడే పడి వేస్తారు. ఏది ఏమైనప్పటికీ ఆ బుక్‌లను భద్రంగా ఉంచాల్సింది పోయి ఇలా నిర్లక్ష్యంగా విడిచిపెట్టడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై డిఇ సింహాచలం వద్ద ప్రస్తావించగా గతంలో డిసిసిలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఉండేవారు. వారిని తొలగించడంతో ఇంకా ఆ రికార్డ్‌లను అప్పగించలేదు. గదుల సమస్య కూడా ఉంది.


ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ కార్యాలయంలో చిందరవందరగా ఉన్న రికార్డులు


ఆర్థికసాయం అందజేస్తున్న ప్రకాష్

ప్రకాష్ ఉదారత

ప్రజాశక్తి- కవిటి

తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న కవిటి మండలం గుజ్జుపుట్టుగకు చెందిన మురపాల దుర్గారావుకు కవిటి ఎంపిపి ప్రతినిధి, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్ అండగా నిలిచారు. శుక్రవారం ఆస్పత్రికి వెళ్లిన ప్రకాష్ దుర్గారావు ఆరోగ్య పరిస్థితి తెలుసు కున్నారు. తనవంతుగా రూ.11 వేలు అందించారు. కార్యక్రమంలో కొర్రాయి గోపాల్ పాల్గొన్నారు.